

సుంకేసుల గేటు ఎత్తివేత

గూడూరు: ఎగువన కురిసిన భారీ వర్షాలతో సుంకేసుల జలాశయానికి శనివారం 2,181 క్యూసెక్కుల నీరు చేరుతోంది. ఒక గేటును అర మీటరు ఎత్తి అంతే నీటిని శ్రీశైలం వైపు మళ్లించారు.



చురుగ్గా నేషనల్ హైవే పనులు

బేతంచెర్ల: ఓర్వకల్లు మండలం సోమయాజుల పల్లె నుంచి బేతంచెర్ల మీదుగా డోన్ వరకు 56 కిలోమీటర్ల మేర రూ.630 కోట్లతో చేపట్టిన నేషనల్ హైవే పనులు చురుగ్గా సాగుతున్నాయి.



తుంగభద్ర డ్యాంకు జలకళ

తుంగభద్ర జలాశయానికి 83,214 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. జలాశయంలో శనివారం సాయంత్రం సమయానికి 69.473 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

8లో

న్యూస్‌రీల్

మంత్రాలయంలో భక్తుల రద్దీ



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

మంత్రాలయం: ఏకాదశి సందర్భంగా శనివారం శ్రీ రాఘవేంద్రస్వామి నిజరూప బృందావనాన్ని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమంలో భాగంగా శ్రీ మఠం పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. మనఊరు–మనగుడి–మన బాధ్యత నిర్వాహకులు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దాదాపు 100 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైఎస్సార్ పెన్షన్ కానుకకు రూ.124.61 కోట్లు

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్ పెన్షన్ కానుక కింద ఆగస్టు నెల పింఛన్ల పంపిణీకి ఉమ్మడి కర్నూలు జిల్లాకు రూ.124,61,09,750 విడుదలయ్యాయి. మొత్తం 4,49,722 పింఛనుదారులకు ఆగస్టు 1వ తేదీ ఉదయం 5 గంటల నుంచి వార్డు, గ్రామ వలంటీర్లు ఇంటింటికి వెళ్లి నగదు పంపిణీ చేయనున్నారు. కర్నూలు జిల్లాలో 2,36,082 పింఛన్లకు రూ.65,64,52,250.. నంద్యాల జిల్లాలో 2,13,640 పింఛన్లకు రూ.58,96,57,500 విడుదలైంది. వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీకి అవసరమైన నిధులను సిద్ధం చేసుకోవాలని డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల బ్యాంకర్లకు సూచించారు. జూలై 31న సోమవారం నగదును బ్యాంకుల నుంచి వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు డ్రా చేస్తారని.. మంగళవారం నుంచి 5 రోజుల పాటు పింఛన్ల పంపిణీ కొనసాగుతుందన్నారు.

1న ఐఏబీ సమావేశం

కర్నూలు సిటీ: ఖరీఫ్ ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేసే అంశంపై చర్చించేందుకు ఆగస్టు 1వ తేదీన సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశాన్ని నిర్వహించనున్నారు. జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 10.30 గంటలకు సమావేశాన్ని నిర్వహించనున్నారు. సమావేశానికి కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు, ఉమ్మడి కర్నూలు, వైఎస్సార్ జిల్లాల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు. ప్రాజెక్టుల్లో నీటి లభ్యత ఆధారంగా ఏ కాల్వ కింద ఎంత ఆయకట్టుకు నీరు ఇచ్చేందుకు అవకాశం ఉందో జలవనరుల శాఖ ఇంజినీర్లు వివరాలను సేకరిస్తున్నారు.

శాంతి సీమ

ఉమ్మడి కర్నూలు జిల్లాలో గణనీయంగా తగ్గిన నేరాలు





కృష్ణకాంత్
కర్నూలు జిల్లా ఎస్పీ

రఘువీర్ రెడ్డి
నంద్యాల జిల్లా ఎస్పీ



గతానికి భిన్నంగా సీమ శాంతి గీతం ఆలపిస్తోంది. నేరాల కట్టడికి పోలీసుల కృషి, ప్రణాళికతో పాటు సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ప్రధానంగా దోహదం చేస్తోంది. ఈ ఏడాది మొదటి రెండు త్రైమాసికాలలో నేర శాతాన్ని పరిశీలిస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకొచ్చిన సంస్కరణలు క్షేత్రస్థాయిలో ఎంత ప్రభావం చూపుతున్నాయో అర్థమవుతోంది. ఒక గ్రామంలో సమస్య ఉత్పన్నమైతే వెంటనే వలంటీర్ గుర్తించి మహిళా పోలీసుకు చెప్పడం, వారు పోలీసుల దృష్టికి తీసుకెళ్లడం.. ఆ వెంటనే అప్రమత్తమై ఆదిలోనే పరిష్కరించడం జరిగిపోతుంది. ఈ కారణంగా నేరాలకు అవకాశమే లేకుండా పోతుంది. అడపాదడపా వెలుగుచూసినా పోలీసుల కృషితో రాజీమార్గం ఇరువర్గాలను శాంతిపజేస్తోంది. – సాక్షి ప్రతినిధి కర్నూలు

- వలంటీర్, సచివాలయ వ్యవస్థతో ప్రతీ సమస్య పోలీసు దృష్టికి
- సమస్య వచ్చిన వెంటనే స్పందించి చర్యలు
- గత మూడేళ్లతో పోలిస్తే కర్నూలులో 27శాతం, నంద్యాలలో 23 శాతం తగ్గిన దాడులు
- మహిళా నేరాల్లో కర్నూలులో 45శాతం, నంద్యాలలో 30శాతం తగ్గుదల
- ప్రాపర్టీ రికవరీ, రోడ్డు ప్రమాదాల నివారణలోనూ మెరుగు
- ప్రభుత్వ చర్యలతో శాంతిభద్రతల్లో గణనీయ మార్పు

➤ కల్లూరు పరిధిలోని రాధానగర్‌లో ఓ యువతిని ఓ అబ్బాయి, వారి తరఫు బంధువులు చూసి ఇష్టం లేకపోయినా పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేశారు. చివరకు భయపెట్టి బలవంతం చేశారు. దీంతో ఆ యువతి ఏం చేయాలో తెలీక ఒత్తిడికి లోనైంది. విషయం తెలిసి సీఐ దృష్టికి తీసుకెళ్లగా కౌన్సెలింగ్ ఇచ్చి సమస్య పరిష్కరించారు.

➤ గురుబ్రహ్మనగర్ ఎంఎస్‌9 అపార్ట్‌మెంట్‌లో ఓ మహిళను ఆమె భర్త రోజూ తాగి డబ్బులు ఇవ్వాలని వేధించేవారు. ఈ నేపథ్యంలో ఆమె తీవ్ర మనోవేదనకు లోనైంది. విషయం తెలిసి సమాచారాన్ని స్థానిక సీఐ దృష్టికి తీసుకెళ్లగా ఆయన భార్య, భర్తలకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది.



➤ గురుబ్రహ్మనగర్‌లో ఒక అమ్మాయి, అబ్బాయి ప్రేమించుకున్నారు. అయితే అబ్బాయి పెళ్లి చేసుకోకుండా మొహం చాటేశాడు. దీంతో ఆ అమ్మాయి ఏం చేయాలో తెలీక డిప్రెషన్‌లోకి వెళ్లింది. విషయం తెలుసుకుని పోలీసులకు సమాచారం ఇచ్చాను. వారు అబ్బాయిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పెళ్లి చేసుకునేలా చేశారు. ఇప్పుడు వారికి పెళ్లయింది, బాబు పుట్టి సంతోషంగా ఉన్నారు.

– కర్నూలులో 92వ వార్డు సచివాలయం మహిళా పోలీసు మనీష

ఇటీవల డీజీపీ రాజేంద్రనాథరెడ్డి రాయలసీమ జిల్లాలలో పర్యటించి నేరసమీక్ష నిర్వహించారు. ఆ సందర్భంగా నేరాలను అరికట్టడంలో పోలీసు పాత్రను కొనియాడారు. సచివాలయ పోలీసులు కూడా శ్రమిస్తున్నారని అభినందించారు. ఇందుకు కారణాలను నిశితంగా విశ్లేషిస్తే సివిల్, మహిళా పోలీసులు సమష్టి పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. వీరు కలిసి కట్టుగా ప్రతీ వార్డులోనూ తిరిగి ప్రతి ఇంటిపై అవగాహన పెంచుకున్నారు. భూ సమస్యలు, ఇంటి సమస్యలు, కుటుంబ కలహాలు, అసాంఘిక శక్తులు, నేరస్తుల కదలికతో పాటు ప్రతీ అంశంపై నిఘా పెడుతున్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి సమస్య మూలాలను తెలుసుకుని పరిష్కార మార్గాలు చూపిస్తూ ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. నేరాల నిరోధానికి 'ఈ–బీట్స్' ద్వారా గస్తీని ముమ్మరం చేశారు. దీంతో గొడవలు, దొమ్మీలు, కుటుంబ కలహాలు తగ్గుముఖం పట్టాయి.

సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో పెనుమార్పు

సచివాలయ వ్యవస్థ అంటే పరిపాలనలో కాదు నేరాల నియంత్రణకూ దోహదపడుతోంది. ఇదివరకు లేనట్టు ప్రతీ గ్రామంలో సచివాలయం, ఆర్బీకే, విలేజ్ క్లీనిక్, డిజిటల్ లైబ్రరీ, బల్క్‌మిల్క్ యూనిట్లు ఏర్పాటయ్యాయి. సగటున ప్రతి గ్రామంలో 30మంది ప్రభుత్వ ఉద్యోగులు రోజూ కనీసం 8గంటలు ఉంటున్నారు. వీరికి ఆ గ్రామంపై పూర్తి అవగాహన ఉంటుంది. వీరితో పాటు ప్రతి 50 ఇళ్లకు వలంటీర్ ఉన్నారు. దీంతో ప్రతి ఇంటిపై, వ్యక్తిపై అవగాహనతో పాటు నిఘా ఉంటోంది. చిన్న సమస్య ఉత్పన్నమైనా, ఉత్పన్నమయ్యే పరిస్థితి ఉన్నా మహిళా పోలీసు ద్వారా పోలీసులకు సమాచారం వెళ్తోంది. దీంతో సమస్య రాకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అలాగే 30మంది ఉద్యోగులు రోజూ గ్రామస్తులతో మాటామంతీ కలపడం వల్ల మంచి–చెడు తేడాలపై చర్చించి గ్రామస్తుల్లో అవగాహన పెంచుతున్నారు. దీనికి తోడు ఉద్యోగస్తులను చూసి తమ పిల్లలను కష్టపడి చదివించాలి, ఉద్యోగస్తులను చేయాలనే సంకల్పం కూడా పల్లె ప్రజల్లో పెరుగుతోంది. వెరసి ఈ పరిణామాలతో 'సోషియల్ అవేర్‌నెస్' వచ్చి నేరాల తీవ్రత తగ్గేందుకు కారణమవుతున్నాయి. కర్నూలు జిల్లాలో 2022లో వరకట్న వేధింపులతో నలుగురు ప్రాణాలు కోల్పోతే ఈ ఏడాది ఒక్క కేసు మాత్రమే నమోదైంది. ఈ సమస్యలు ముందస్తుగా గుర్తించి పోలీసులు కౌన్సెలింగ్ ఇవ్వడమే ఇందుకు ప్రధాన కారణం. మొత్తంగా 2022తో పోలిస్తే 2023లో కర్నూలు జిల్లాలో నేరాల రేటు కర్నూలు జిల్లాలో 38శాతం, నంద్యాల జిల్లాలో 25 శాతం తగ్గింది. హత్యలు, కొట్లాటలు, అసాంఘిక శక్తులపై నిఘా, పీడీ యాక్ట్ ప్రయోగం, తక్షణ అరెస్టులు, బైండోవర్ లాంటి చర్యలతో నేరాలు అదుపులోకి వచ్చాయి.



కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్

'కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్' 2022 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలవుతోంది. దీంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. నేరాల తీవ్రతను గుర్తించిన 122 కేసుల్లో 100 కేసుల విచారణ పూర్తయింది. మహిళలపై నేరాలు, పోక్సో కేసులు, ఇతర నేరాలను 'పైలెట్ ప్రాజెక్టు'గా గుర్తించి పకడ్బందీగా విచారణ చేపట్టారు. ఈ 101 కేసుల్లో డెత్ పెనాల్టీ నుంచి న్యాయస్థానాలు నిందితులకు జైలు శిక్ష కూడా విధించాయి. ఈ ఏడాది కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్‌లో ఒక్కో పోలీసు అధికారికి 10 చొప్పున కేటాయించారు. ఈ కేసుల్లో రికార్డుస్థాయిలో 62.5 శాతం కన్విక్షన్ నమోదైంది. తీవ్రమైన నేరాలను కూడా ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా మూడు నెలల్లో పరిష్కరిస్తున్నారు.

2022 మొదటి ఆర్నెల్లతో పోల్చితే 2023లో తగ్గిన నేరాలు:

- ➡ భౌతిక దాడులు కర్నూలులో 27, నంద్యాల జిల్లాలో 23 శాతం తగ్గాయి.
- ➡ దొంగతనాలు, దొమ్మీలు కర్నూలులో 42, నంద్యాల జిల్లాలో 26శాతం తగ్గుదల.
- ➡ మహిళలపై తీవ్ర నేరాలు కర్నూలు జిల్లాలో 45శాతం, నంద్యాల జిల్లాలో 30శాతం తగ్గాయి.
- ➡ రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. బ్లాక్ స్పాట్‌ల గుర్తింపు, ఆర్టీఓ/ఇంజనీరింగ్ సిబ్బందితో జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేస్తున్నారు. వాహన తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్, అవగాహన సదస్సులు, ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పెంపు తదితర చర్యలతో కర్నూలులో 39శాతం, నంద్యాలలో 21శాతం రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం.
- ➡ మహిళల రక్షణకు ప్రభుత్వం దిశ యాప్‌ను ప్రత్యేకంగా తీసుకొచ్చింది. మహిళలు, విద్యార్థినుల రక్షణకు ఇది దోహదపడుతోంది. పోలీసులు అన్ని ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి యాప్‌ను డౌన్‌లోడ్ చేస్తున్నారు. ఇప్పటి దాకా రాష్ట్రంలో 1,24,38,335 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

గొడవ జరగకుండా చూశా



తుమ్మలపెంటలో రోడ్డుపక్కన ఇద్దరు చికెన్ వ్యాపారుల మధ్య గొడవ జరిగింది. ఒక వర్గానికి చెందిన వ్యక్తులు మరొక వ్యాపారి ఇంట్లోకి వెళ్లి దంపతులపై దాడికి పాల్పడ్డారు. గొడవ ఉద్రిక్తతకు దారి తీసింది. వెంటనే కొలిమిగుండ్ల పోలీసులకు సమాచారం ఇచ్చాను. వారు వచ్చి పరిస్థితి అదుపు చేసి ఇద్దరినీ మందలించారు. దీంతో గొడవ సద్దుమణిగింది.

– బనగానపల్లి మండలం పలుకూరు–1 సచివాలయం మహిళా పోలీసు లక్ష్మీ ప్రసన్న

నకిలీ ఆధార్‌కార్డు ఆటకట్టించా!



పింఛనుతో పాటు పలు ప్రభుత్వ పథకాలను పొందేందుకు కొందరు ఆధార్‌కార్డులతో వెల్ఫేర్ సెక్రటరీ వద్దకు వచ్చారు. చూసేందుకు 35–40 ఏళ్లు ఉన్న వ్యక్తులకు ఆధార్‌లో 60 ఏళ్లు ఉన్నాయి. ఆధార్ పరిశీలిస్తే కొద్దిరోజుల కిందట వయస్సు మార్చినట్లు తేలింది. ఇలా 50మందికి పైగా మా సచివాలయం పరిధిలో ఆధార్ మార్పు చేసుకున్నారు. ఒక్కో ఆధార్‌కు రూ.10వేలు–20వేలు తీసుకున్నారు. ఆధార్ కుంభకోణాన్ని అప్పటి ఎస్పీ పక్కీరప్ప దృష్టికి తీసుకెళ్లా. అప్పటి ఎస్పీ రవిపటాన్ శెట్టి జోక్యం చేసుకుని విచారిస్తే 200కుపైగా ఆధార్‌కార్డులు చేశారని తేలింది. అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా ఈ విషయం సంచలనమైంది. ఆపై అన్నిచోట్ల ఆధార్‌లో వయస్సు మార్పులను గమనించి అర్హులకు న్యాయం జరిగేలా, అనర్హులను తొలగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

– విజయలక్ష్మి, గుండ్ల శింగవరం మహిళా పోలీసు

లోక్ అదాలత్‌తో పెద్ద ఎత్తున కేసుల పరిష్కారం

ఈ ఏడాది రెండు విడతలుగా లోక్ అదాలత్‌ను పోలీసులు కేసులను పరిష్కరించారు. సుదీర్ఘకాలంగా చిన్నపాటి వివాదాలు, మనస్పర్థలు, వివాదాల కేసులను పోలీసులు శ్రమించి ఇరువర్గాలను పిలిపించి కేసు తీవ్రత, జరగబోయే పరిణామాలు, ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కౌన్సెలింగ్ ఇచ్చి రాజీపడేందుకు కృషి చేశారు. పోలీసులు, న్యాయవ్యవస్థ సమన్వయంతో ఇది సాధ్యమైంది. భవిష్యత్‌లో మరిన్ని కేసులను 'లోక్ అదాలత్'లో పరిష్కరించేందుకు పోలీసులు కృషి చేస్తున్నారు.

సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు

సైబర్ నేరాల నియంత్రణ కోసం సైబర్‌ల్యాబ్ ఏర్పాటైంది. మంగళగిరిలో సోషల్ మీడియా మానిటరింగ్‌సెల్ ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాల్లోని సైబర్‌ల్యాబ్, సోషల్ మీడియా సెల్‌ను ఓ సీనియర్ పోలీసు అధికారి పర్యవేక్షణలో సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నారు.

సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం

- ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్‌సీపీదే విజయం
- గ్రామాల్లో, వార్డుల్లో తిరిగితే అభివృద్ధి కనిపిస్తుంది
- పచ్చమీడియాలో మాట్లాడితే లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది
- వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్లు అమర్‌నాథ్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి



మాట్లాడుతున్న వైఎస్‌ఆర్‌సీపీ కర్నూలు జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ ఆకెపాటి అమర్‌నాథ్ రెడ్డి, చిత్రంలో రీజినల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

కర్నూలు(సెంట్రల్): సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సమ ప్రాధాన్యత ఇస్తోందని వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్లు ఆకెపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి అన్నారు. అభివృద్ధి ఎక్కడ అని ప్రశ్నించే వారు గ్రామాలు, వార్డుల్లో తిరిగితే కనిపిస్తుందన్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ గ్రంథాలయాలతోపాటు ఆధునీకరించిన పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రులు కనిపిస్తాయని పేర్కొన్నారు. పచ్చమీడియాలో మాట్లాడితే లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది తప్ప అభివృద్ధి కనిపించదని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, ఆయన తనయుడు లోకేష్, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లకు చురకలంటించారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో వైఎస్సార్‌సీపీ జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రీజినల్ కోఆర్డినేటర్లతోపాటు ఎమ్మెల్సీ మధుసూదన్, మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యేలు చెన్నకేశవరెడ్డి, వై.సాయి ప్రసాద్‌రెడ్డి, వై.బాలనాగిరెడ్డి, హఫీజ్‌ఖాన్, శ్రీదేవి హాజరయ్యారు. ముందుగా వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిపై 40 నిమిషాల నిడివి ఉన్న వీడియోను ప్రదర్శించారు. అనంతరం రీజినల్ కోఆర్డినేటర్లు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం ఉందని చెప్పడానికి జగనన్న సురక్ష, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగడమే నిదర్శనమన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను, రైతు భరోసా కేంద్రాలను ఇతర రాష్ట్రాలు స్ఫూర్తిగా తీసుకొని ప్రశంసిస్తున్నాయన్నారు. రాష్ట్రం అప్పుల పాలవుతోందని గోడు వెళ్లబోసుకున్న చంద్రబాబునాయుడు.. రాజమండ్రి మహానాడులో మాత్రం కాపీ కొట్టిన పథకాలను ప్రకటించి మెరుగైన సంక్షేమం అనడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. చంద్రబాబునాయుడు తన పాలనా కాలంలో ఇరిగేషన్‌ను తీవ్ర నిర్లక్ష్యం చేశారని, వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జలయజ్ఞం చేపట్టి ప్రాజెక్టులకు ప్రాణం పోశారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మిగిలిపోయిన ప్రాజెక్టులను చేపడుతున్నారని వారు వివరించారు.

జగనన్న సురక్షలో 4.17 లక్షల సర్టిఫికెట్లు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ..జగనన్న సురక్ష కార్యక్రమంలో మొత్తం 5,52,867 మంది సర్టిఫికెట్లు, సంక్షేమ పథకాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోగా, ఇప్పటి వరకు 4,17,775 సర్టిఫికెట్లను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వ్యక్తిత్వం లేని పవన్‌కల్యాణ్ వ్యక్తిగతంగా విమర్శిస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పవన్‌కు జెండా లేదని, గుర్తు గ్లాసు కూడా లేదని, కేవలం చంద్రబాబు స్క్రిప్టును చదువుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. వలంటీర్లు ఏమి చేస్తున్నారో అవ్వాతాతలను అడిగితే చెబుతారని సూచించారు.

మహిళలంటే పవన్‌కు చులకన

పవన్ కల్యాణ్‌కు మహిళలంటే చులకన అని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. ఎక్కడ మహిళలు అదృశ్యమవుతున్నారో చెప్పాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా పత్తికొండ నియోజకవర్గంలో 36 వేల మందికి సర్టిఫికెట్లను జారీ చేసినట్లు చెప్పారు. కర్నూలు మాజీ ఎంపీ బుట్టా రేణుక మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడం కోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీరు వ్యవస్థలను తెచ్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రదీప్‌రెడ్డి, పుల్లారెడ్డి, శ్రీనివాసరెడ్డి, మద్దయ్య, ధనుంజయాచారి, డీకే రాజశేఖర్, సత్యంయాదవ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో సుపరిపాలన

రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగుతోందని, వైఎస్సార్‌సీపీకి చంద్రబాబు, పవన్ కల్యాణ్ పోటీ కాదని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. వారు అసలు ఏపీలో నివాసం ఉండటం లేదన్నారు. వలంటీర్ వ్యవస్థ ఎలా పనిచేస్తుందో కర్నూలుకు వస్తే పవన్ కల్యాణ్‌కు చూపిస్తానన్నారు. ఒక గల్లీ తిరగకుండా..ఒక్క పట్టణం, గ్రామంలో పర్యటించకుండా చంద్రబాబు రాసిన స్క్రిప్టును చదివే పవన్‌కు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శించే స్థాయి లేదన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో కర్నూలు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 73 వేల మందికి 11 రకాల సర్టిఫికెట్లను జారీ చేశామన్నారు.



హొళగుంద గ్రామంలో పీర్ల ఊరేగింపులో పాల్గొన్న ప్రజలు

ఊరూరా సామరస్య దీప్తి



పెద్దకడబూరు మండలం పీకలబెట్టలో అగ్నిగుండంలో కూర్చొని రొట్టెలు కాల్చుతున్న జుబేరుతాత

మొహర్రం వేడుకల్లో మత సామరస్యం వెల్లివిరిసింది. హిందువులు, ముస్లింలు సమైక్యంగా పండుగను జరుపుకున్నారు. పలు గ్రామాల్లో ముందుగా నగారా బండిని ఊరేగించారు. అనంతరం లేవడి(బొరుగులు పంపిణీ చేసే) కార్యక్రమాన్ని నిర్వహించారు. పీర్ల ఊరేగింపులో హిందూముస్లింలు పాల్గొని భక్తిభావాన్ని చాటారు. పలువురు అగ్నిగుండం చుట్టూ తిరుగుతూ అలాయి బలాయి ఆడారు. శనివారం చాలా మంది ఉపవాస దీక్షలు చేపట్టారు. కొంత మంది పీర్ల చావిడిలు, మసీదుల వద్ద షర్బత్‌ను పంపిణీ చేశారు. హసన్, హుసేన్ త్యాగాలను స్మరించుకున్నారు. – సాక్షినెట్‌వర్క్



కౌతాళం మండలం ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో పీర్లదేవుడికి పూజలు చేస్తున్న దృశ్యం

క్లుప్తంగా


విద్యుత్ సమస్యలను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

కర్నూలు(రాజ్‌విహార్): వర్షాలు, వరదలతో కలిగే విద్యుత్ సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని విద్యుత్ శాఖ సిబ్బందిని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి హెచ్చరించారు. శనివారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా తరచూ అంతరాయ సమస్యలు వస్తుంటాయని, వీటిని తెలుసుకునేందుకు సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ 7382614308ను తీసుకొచ్చినట్లు చెప్పారు. కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి ఈ నంబరుకు వచ్చే ఫిర్యాదులను సర్కిల్ కార్యాలయంలో నమోదు చేసి, ఆయా ఏఈ కార్యాలయాలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. వీటిపై ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

తుంగభద్ర డ్యాంకు జలకళ

- 69 టీఎంసీల నీటి చేరిక
- కొనసాగుతున్న 83 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


ఆలూరు/హొళగుంద/కోసిగి: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో తుంగభద్ర జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి 83,214 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. డ్యాం పూర్తిస్థాయి నీటి మట్టం 1633 అడుగులు కాగా ప్రస్తుతం 16222.78 అడుగులకు చేరింది. జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 105 టీఎంసీలు కాగా..ప్రస్తుతం 69.473 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా టీబీ బోర్డు అధికారులు ఎల్లెల్సీకి ఈ నెల 28న నీటిని విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆ నీరు నాలుగైదు రోజుల్లో జిల్లా సరిహద్దుకు చేరుకుంటాయి. దిగువ కాలువ(ఎల్లెల్సీ) కింద కర్నూలు జిల్లాలో ఖరీఫ్‌లో 43 వేలు, రబీలో 1.7 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించారు. ప్రస్తుతం జలాశయం నుంచి హెచ్ఎల్సీ, ఎల్లెల్సీ, రాయబసవన కాలువలకు (ఔట్‌ఫ్లో) 1,473 క్యూసెక్కులను వదులుతున్నారు.


భారీగా వరద నీరు చేరడంతో కళకళలాడుతున్న తుంగభద్ర డ్యాం

కాలువకు నీరు విడుదల కావడంతో వరి నారుకు డిమాండ్ పెరిగింది.

ఆర్డీఎస్‌కు చేరిన వర్షపు నీరు

కోసిగి మండలం కందుకూరు గ్రామ సమీపంలోని తుంగభద్ర నదిపై నిర్మించిన రాజోలి బండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఆనకట్ట వద్దకు వర్షపు నీరు చేరుకుంది. దీంతో మండలంలోని నది తీర గ్రామాలైన కడదొడ్డి, అగసనూరు, కందుకూరు, లక్ష్మీనగర్ క్యాంప్, సాతనూరు, తుంబిగనూరు గ్రామాల రైతులు వరి పంటలు సాగుకు సిద్ధమయ్యారు.


ఆర్డీఎస్ ఆనకట్ట ఎత్తు వరకు చేరుకున్న వర్షపు నీరు

ఒకే కాన్పులో ముగ్గురు శిశువుల జననం

కర్నూలు(హాస్పిటల్): ఒకే కాన్పులో ఓ మహిళ ముగ్గురు శిశువులకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డలు క్షేమంగా ఉన్నారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ మాణిక్యరావు, డాక్టర్ శ్రీలక్ష్మి తెలిపిన వివరాల మేరకు.. కృష్ణగిరికి చెందిన మున్ని(35)కి అక్బర్‌బాషతో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. మొదటి సారి అబార్షన్ కాగా ఐదేళ్ల క్రితం సాధారణ ప్రసవం అయ్యింది. అప్పటి నుంచి మళ్లీ గర్భం దాల్చకపోవడంతో గైనకాలజీ విభాగంలో చికిత్స చేయించుకోవడంతో గర్భం దాల్చింది. కొంతకాలం తర్వాత స్కానింగ్ చేయగా ఆమె గర్భంలో ముగ్గురు శిశువులు ఉన్నట్లు గుర్తించారు. ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తూ ఆమెకు వైద్యం అందిస్తూ జాగ్రత్తలు చెబుతూ వచ్చారు. ఆమెను 25 రోజులు ముందుగా ఈ నెల 5న ఆసుపత్రిలో చేర్చుకుని అవసరమైన చికిత్స అందించారు. శనివారం ఆమెకు సిజేరియన్ ద్వారా కాన్పు చేశారు.


ప్రసవం అనంతరం ముగ్గురు శిశువులు

ప్రసవంలో ఒక ఆడ, ఇద్దరు మగశిశువులు జన్మించారు. ఆడ శిశువు, మగశిశువు రెండేసి కిలోలు ఉండగా, మరో మగశిశువు 1.5కిలోల బరువు ఉన్నారు. తల్లీ బిడ్డలు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. విలేకరుల సమావేశంలో డాక్టర్ రత్నకుమారి, డాక్టర్ సుప్రియ, అనెస్తీషియా వైద్యులు శ్రీనివాసులు, మహేష్, పీజీలు మోనీషా, ఆఫ్రిన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పూజారులు మృతి


మృతి చెందిన అనిల్‌కుమార్, రాఘవేంద్ర (ఫైల్)

తంబళ్లపల్లె /కురబలకోట: తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఆలయ పూజారులుగా పని చేస్తున్న ఇద్దరు యువకులు అనంతపురం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కుటుంబీకుల కథనం మేరకు వివరాలు ఇలా... కర్నూలు జిల్లా తుగ్గలి మండలం పగిడిరాయి గ్రామానికి చెందిన రాఘవేంద్రస్వామి(28) తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో పూజారిగా ఉన్నారు. ఆయన భార్య అనిత, ఇద్దరు చిన్నపిల్లలతో అంగళ్ళులో కాపురం ఉంటున్నారు. ఇతని బావమరిది అనిల్‌కుమార్(29) కురబలకోట మండలం తెట్టు శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో పూజారిగా ఉన్నారు. ఆయనది అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలంలోని ముకుందాపురం. ఏడాది క్రితం రాధమ్మతో వివాహమైంది. రాఘవేంద్రస్వామి, అనిల్‌కుమార్ గార్లదిన్నెలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సమీప బంధువు ఇంటికి వెళ్లారు. అతను మొహర్రం సందర్భంగా విధుల్లో బిజీగా ఉండటంతో శుక్రవారం సాయంత్రం వెనుదిరిగి బైక్‌పై వస్తున్నారు. ఈ క్రమంలో గార్లదిన్నె వద్ద ఐచర్ లారీ ఢీకొంది. ప్రమాదంలో రాఘవేంద్రస్వామి అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన అనిల్‌కుమార్‌ను 108 వాహనంలో అనంతపురంలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. మృతదేహాలకు శనివారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. అనంతరం స్వగ్రామాలకు తరలించారు.

5న ఐలూ జిల్లా మహాసభ

కర్నూలు(లీగల్): ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) జిల్లా మహాసభ కర్నూలులో ఈ నెల 5వ తేదీన జరగనున్నట్లు ఐలూకేంద్ర కమిటీ సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు కెంగార కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి కర్నూలు సిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికుమార్, సింగరాజు లక్ష్మన్న, ఐలూ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.తిరుపతయ్య, కాశీ విశ్వనాథ్, ఐలు జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, ఎం.ప్రసాద్, చరణ్ హాజరకానున్నట్లు తెలిపారు. జిల్లాలోని సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులంతా హాజరు కావాలని కోరారు.

విద్యుదాఘాతంతో బీటెక్ విద్యార్థి మృతి

- పీర్లచావిడి తీగలు తొలగిస్తుండగా ప్రమాదం


శేఖర్ (ఫైల్)

సి.బెళగల్: విద్యుదాఘాతంతో బీటెక్ చదువుతున్న శేఖర్ (20) అనే విద్యార్థి మృతి చెందాడు. ఈ దుర్ఘటన సి.బెళగల్ మండలం గొల్లలదొడ్డి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ పీరయ్య, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బోయ రాముడు, కేశమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు శేఖర్ ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం చేయగా కుమారుడు శేఖర్ హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ (సీఎస్సీ) మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గ్రామంలో జరిగే మొహర్రం వేడుకలకు గత వారం హైదరాబాద్ నుంచి గ్రామానికి వచ్చాడు. శనివారం పండుగ ముగుస్తుండటంతో గ్రామంలో పీర్ల చావిడికి ఏర్పాటు చేసిన రంగుల విద్యుత్ బల్బులను తొలగిస్తున్నారు. ఈ క్రమంలో విద్యుత్ ప్రవాహం ఉన్న తీగ (జీ వైర్) ఇంటి ముందు బైక్‌పై కుర్చున్న శేఖర్ మెడపై పడటంతో విద్యుత్ షాక్ గురై అపస్మాకర స్థితిలో బైక్‌పైనే ఉండిపోయాడు. గమనించిన స్థానికులు విద్యుత్ తీగలను తొలగించి శేఖర్‌ను సి.బెళగల్‌లోని ప్రైవేట్ వైద్యుడి దగ్గరికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తెరిపిచ్చిన వర్షం

కర్నూలు(అగ్రికల్చర్)/నంద్యాల(సెంట్రల్): కర్నూలు జిల్లాలో జూలై నెలలో 63 శాతం అధికంగా వర్షాలు కురిశాయి. జూలై నెల సాధారణ వర్షపాతం 90.7 మి.మీ ఉండగా 147.7 మి.మీ వర్షపాతం నమోదు కావడం విశేషం. కేవలం ఆలూరు, హొళగుంద, ఆస్పరిలో మాత్రమే లోటు వర్షపాతం ఉంది. కాస్త ఆలస్యంగానైన జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడటంతో రైతులు ఉపశమనం పొందుతున్నారు. వర్షాలు కాస్త తెరిపివ్వడంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కాగా శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు జిల్లాలోని 16 మండలాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి. కొతాళంలో 12.6 మి.మీ, గూడూరులో 12.2, ఎమ్మిగనూరులో 11.2, పత్తికొండలో 11.2, పెద్దకడుబూరులో 8.2 మి.మీ వర్షం కురిసింది. జిల్లా మొత్తం సగటున 3.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

నంద్యాల జిల్లాలో 19 శాతం ఎక్సెస్

జూలై నెల నంద్యాల జిల్లాలో వర్షాలు ఆశాజనకంగా కురిశాయి. సాధారణ వర్షపాతం 141.2 మి.మీ ఉండగా 168.7 మి.మీ వర్షపాతం నమోదైంది. అంటే 10 శాతం అధిక వర్షపాతం నమోదు కావడం విశేషం. అయితే ఉయ్యాలవాడ, సంజామల, కొలిమిగుండ్ల, శ్రీశైలం, ఆళ్లగడ్డ, అవుకు, ప్యాపిలి, చాగలమర్రి మండలాల్లో లోటు వర్షపాతం ఉంది.

విద్యుదాఘాతంతో రెండు ఎద్దులు మృతి

ఓర్వకల్లు: కన్నమడకల గ్రామానికి చెందిన ఓ చిన్నకారు రైతుకు సంబంధించిన రెండు ఎద్దులు విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన మాల జమ్మన్న కొడుకు తిరుపతయ్య వ్యవసాయ పనుల మీదనే ఆధారపడి జీవిస్తున్నారు. ప్రతి రోజు రైతుల పొలాలకు వెళ్లి సేద్యం చేసేవాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం ఎద్దుల బండిపై రసాయన ఎరువులను ఎత్తుకొని పొలానికి బయలుదేరారు. ఇందులో భాగంగా స్థానిక వినాయక గుడి దాటాక, వెంకన్న బావి వద్ద విద్యుత్ తీగలు తెగి ఎద్దులపై పడ్డాయి. దీంతో రెండు ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. విషయం తెలుసుకున్న విద్యుత్ ఏఈ ప్రసాద్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద తీరును పరిశీలించారు. బాధిత రైతుకు తగిన న్యాయం చేస్తామని తెలిపారు.


ఘటనా స్థలంలో మృతి చెందిన ఎద్దులు

పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

కర్నూలు(హాస్పిటల్): ఏపీ స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్ కౌన్సిల్ వారు డిప్లమా పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్. నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా ఇన్ అనెస్తీషియా, ఎంఎల్‌టీ, రేడియాలజీ, ఆప్టోమెట్రి టెక్నీషియన్, ఆఫ్తాల్మిక్ అసిస్టెంట్, ఆడియోమెట్రీ టెక్నీషియన్, డీఎంఎస్‌టీ, ఈసీజీ, కార్డియాలజీ, క్యాథలాబ్, డయాలసిస్, రెస్పిరేటరి థెరపీ, ఫర్ఫ్యూజన్, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ కోర్సుల్లో అడ్మిషన్లు యదావిధిగా జరుగుతున్నాయని, కన్వీనర్ కోటాకు ఆగస్టు 19వ తేదీ వరకు, మేనేజ్‌మెంట్ కోటాకు సెప్టెంబర్ 14వ తేదీ వరకు గడువు పొడిగించారని ఆయన తెలిపారు. కన్వీనర్ కోటాలో అడ్మిషన్ తీసుకున్న వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుందన్నారు. వివరాలకు కర్నూలులోని కిమ్స్ హాస్పిటల్‌లో గల బొల్లినేని మెడిస్కిల్స్(సెల్ :7995013422, 7337362530)ను సంప్రదించాలన్నారు.

ఇంటికి చేరుకున్న పారిపోయిన విద్యార్థి

ఆదోనిఅర్బన్ : పరీక్షల భయంతో పారిపోయిన విద్యార్థి పోలీసుల సహకారంతో శనివారం ఇంటికి చేరుకున్నాడు. ఆదోని పట్టణం ఆర్టీసీ కాలనీకి చెందిన గొల్ల రాజగోపాల్ కుమారుడు విజయ్‌కుమార్ పదో తరగతి చదువుతున్నాడు. చదువుకోవడానికి ఇబ్బందిగా ఉందని తమిళనాడు రాష్ట్రం చెన్నైకి రైలులో ఈనెల 27న పారిపోయాడు. కుమారుడి ఆచూకీ తెలియకపోవడంతో తండ్రి రాజగోపాల్ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. విద్యార్థి విజయ్‌కుమార్ స్నేహితులను పోలీసులు విచారించగా రైలులో చెన్నైకి వెళ్లినట్లు తేలింది. వెంటనే పోలీస్ సిబ్బందిని చెన్నైకి పంపి ఆ బాలుడి బంధువుల సాయంతో చెన్నైలో ఆచూకీ తెలుసుకుని బాలుడిని తీసుకొచ్చారు. శనివారం రాత్రి తండ్రి రాజగోపాల్‌కు అప్పగించినట్లు సీఐ శ్రీనివాసనాయక్ విలేకరులకు తెలియజేశారు.

తెలుగుగంగలో టిప్పర్ బోల్తా



మహానంది: మహానంది సమీపంలోని కృష్ణనందికి వెళ్లే మార్గంలో శనివారం ఓ టిప్పర్ తెలుగు గంగ కాల్వలో బోల్తాపడింది. కృష్ణనంది మార్గంలో కట్టమీదుగా ఉన్న దారిలో వెళ్తుండగా అదుపుతప్పి కాల్వలో పడిందని, ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన డ్రైవర్ వివరాలు తెలియాల్సి ఉంది. ఇటీవల కృష్ణనంది, సమీప పొలాల నుంచి గత కొంత కాలంగా ఎర్ర మట్టి, మొరుసు మట్టి రవాణా జరుగుతుండగా ఇటీవల వర్షాల వల్ల నిలిచిపోయింది. అయితే ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని మహానంది పోలీసులు తెలిపారు.